

మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి

# ఉద్యోగులకు వరం సింగరేణి వైద్యం

## సీఎం కేసీఆర్ కృషితో నల్లసూర్యుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- కోల్‌బెల్ట్ వ్యాప్తంగా మెరుగుపడ్డ దవాఖానలు
- దశాబ్దకాలంలో కార్పొరేట్‌కు దీటుగా సేవలు
- 126 సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌తో అనుబంధం..
- ఏటా వందలాది కోట్ల నిధులు
- గతేడాది రూ.6.25 కోట్లతో ఆధునిక పరికరాల కొనుగోలు
- రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక మెడికల్ ఇన్సూరెన్స్
- ఏసీతో పాటు లైఫ్ సపోర్టు సిస్టం కలిగిన 61 అంబులెన్సులు అందుబాటులోకి

**ప్రత్యేక రాష్ట్రంలో సింగరేణి యాజమాన్యం..** ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ఈ దశాబ్దకాలంలో కోల్‌బెల్ట్ వ్యాప్తంగా సింగరేణి దవాఖానలను ఆధునీకరించి, కార్పొరేట్‌కు దీటుగా మెరుగుపర్చింది. ఎప్పటికప్పుడు ఆధునిక పరికరాలు కొనుగోలు చేసి, పరీక్షలు నిర్వహిస్తూనే.. 126 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో అనుబంధంగా వైద్య సేవలు అందిస్తున్నది. అందుకు ఏటా వందల కోట్ల నిధులు ఖర్చుచేస్తున్నది. అలాగే ఎప్పటికప్పుడు స్పెషలిస్టుల నియామకం చేపడుతున్నది. రిటైర్డ్ ఉద్యోగులకు సైతం మెడికల్ ఇన్సూరెన్స్ కల్పిస్తుండగా, నల్లసూర్యుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

- మందమర్రి, నవంబర్ 17



దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికులు

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకుల పట్టింపు లేనితనంతో సింగరేణి దవాఖానలు దయనీయ స్థితిలో ఉండేవి. ఉద్యోగులు తప్పనిసరి పరిస్థితిలో వ్యయ ప్రయాసలకోర్చి ప్రైవేటు దవాఖానలకు వెళ్లేవారు. తెలంగాణ ఏర్పడిన తరువాత స్వపరిపాలనలో సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపడంతో సింగరేణి అభివృద్ధిని సాధించడంతో పాటు వైద్య సేవలను కూడా మెరుగుపర్చింది. అత్యాధునిక పరికరాలతో పాటు ప్రైవేటు, కార్పొరేట్‌కు దీటుగా దవాఖానలను తీర్చిదిద్దింది. సీఎం ఆదేశాలతో సీఎండీ శ్రీధర్.. ఉత్పత్తితో పాటు ఖర్చుకు వెనుకాడకుండా వైద్యం, వైద్య విభాగం అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

### ఆధునిక పరికరాలు.. కోట్ల నిధులు..

సింగరేణి దవాఖానల్లో వార్డులను ఆధునీకరించి ఏసీ వార్డులుగా మార్చారు. గతేడాది కార్మికుల వైద్యం కోసం యాజమాన్యం రూ.259 కోట్లు వెచ్చించింది. సుమారు ఆరున్నర కోట్లతో సింగరేణి వ్యాప్తంగా ఏడు ఏరియాల దవాఖానలకు కావాల్సిన ఆధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేశారు. ప్రధానంగా 2డీ ఈకో పరికరాలు, సీటి స్కాన్, కంటి పరీక్షల నిర్వహణకు గ్రీన్ లేజర్, యాగ్, నేచర్ ఫండస్ కెమెరాలు, డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లు, షుగర్ పరీక్షలను వేగంగా జరిపేందుకు హెచ్.బీ.ఏ 1సీ యంత్ర విభాగాలను కొనుగోలు చేశారు. కొత్తగూడెం, రామగుండం, రామకృష్ణాపూర్, భూపాలపల్లి ఏరియా దవాఖానల్లో ఫిజియో థెరపీ విభాగాలను ఏర్పాటు చేసి, అత్యాధునిక లేజర్ థెరపి యూనిట్లు, కాంబినేషన్ థెరపి మల్టీ జిమ్‌లు, సీపీఎం మిషిన్లు, మజిల్ స్టిమ్యులేటర్లతో వైద్య సేవలందిస్తున్నారు.

### 126 సూపర్‌స్పెషాలిటీ దవాఖానలతో అనుబంధ..

సింగరేణి ఏరియా ఆసుపత్రులతో పాటు అత్యవసర సమయంలో మెరుగైన వైద్యం అందించేందుకు యాజమాన్యం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి నగరాల్లో 126 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో ఒప్పందం చేసుకున్నది. గని ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడే కార్మికులు.., వారి కుటుంబ సభ్యులు ఎవరైనా వ్యాధుల బారిన పడినప్పుడు హైదరాబాద్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రెఫర్ చేసి, వైద్యం అందిస్తున్నారు. అందుకు సంబందించిన బిల్లులను పూర్తిగా యాజమాన్యమే చెల్లిస్తున్నది. బాధితులను అత్యవసర పరిస్థితిలో దూర ప్రాంతంలోని ఆసుపత్రులకు తరలించేందుకు ఏసీతో పాటు లైఫ్ సపోర్టు సిస్టం కలిగిన 61 అంబులెన్స్‌లను యాజమాన్యం అందుబాటులోకి తెచ్చింది. ప్రత్యేక పాలనలో బొగ్గు ఉత్పత్తితో పాటు వైద్య సదుపాయాలు మెరుగుపడడంపై కార్మికులు, వారి కుటుంబాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఎప్పటికప్పుడు స్పెషలిస్టుల నియామకం.

ఎప్పటికప్పుడు స్పెషలిస్టు వైద్యులను నియమిస్తూ ఖాళీలను భర్తీ చేశారు. ఇప్పటి వరకు 85 మంది స్పెషలిస్టు వైద్యులు, 118 మంది జనరల్ డ్యూటీ వైద్యులు, 342 మంది స్టాఫ్ నర్సులు, అదనంగా కాంట్రాక్టు ప్రాతిపాదికన నలుగురు స్పెషలిస్టు వైద్యులు, 20 మంది జనరల్ డ్యూటీ డాక్టర్లు, 70 మంది స్టాఫ్ నర్సులను నియమించి, వైద్య సేవలందిస్తున్నారు.

### కరోనా సమయంలో విశేష సేవలు..

కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలో సింగరేణి వైద్య విభాగం విశేష వైద్య సేవలందించింది. అన్ని ఏరియా దవాఖానల్లో 1,578 బెడ్లతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. కార్మికులు, వారి కుటుంబాల ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన కొవిడ్ పరీక్షలు చేసి, వ్యాధి తీవ్రతను బట్టి ఐసొలేషన్ వార్డుల్లో చికిత్స అందించారు. ఆ వార్డుల్లో అప్పటికప్పుడు లక్షలాది రూపాయల వ్యయంతో అత్యాధునిక వెంటిలేటర్లు, సీపీఏపీ, బీఐపీఏపీ యంత్రాలను కొనుగోలు చేసి, వైద్యం అందించారు. సింగరేణి కార్మికులకే కాకుండా కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు కూడా వ్యాక్సినేషన్ చేశారు.

### టర్కీ నుంచి ఆక్సిజన్ ప్లాంట్లు..

కొవిడ్ సమయంలో ఎదుర్కొన్న ఆక్సిజన్ కొరతను అధిగమించేందుకు యాజమాన్యం టర్కీ నుంచి ఐదు ఆక్సిజన్ ప్లాంట్లను కొనుగోలు చేసింది. కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రితో పాటు రామగుండం, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, భూపాలపల్లి ఏరియా దవాఖానల్లో ఏర్పాటు చేశారు. వాటి నుంచి నేరుగా వార్డులకే పైప్‌లైన్ సాయంతో ఆక్సిజన్ సరఫరా ప్రారంభించింది. రామగుండం ఏరియా దవాఖానలో వార్డులతో పాటు సిలిండర్లలో ఆక్సిజన్‌ను నింపి సింగరేణిలోని ఇతర దవాఖానలకు సరఫరాను ప్రారంభించింది.

### ఉద్యానవనాలను తలపిస్తున్న దవాఖానలు..

ఏరియా దవాఖానలు ఉద్యానవనాలను తలపిస్తున్నాయి. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న హరితహారంలో యాజమాన్యం కూడా పాల్గొంటున్నది. అందులో భాగంగా సింగరేణి పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలతో పాటు ఆసుపత్రుల ఆవరణలో కూడా విరివిగా మొక్కలు నాటారు. నాడు నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి ఆసుపత్రులకు వచ్చే బాధితులతో పాటు ప్రజలను సేదతీర్చుతున్నాయి. ఆవరణలో పూల పండ్ల మొక్కలు నాటడంతో ఉద్యానవనాలను తలపిస్తున్నాయి.




దవాఖాన ఆవరణలో ఏర్పాటు చేసిన ఆక్సీజన్ ఉత్పత్తి ప్లాంట్

### మెరుగైన వైద్యం అందుతున్నది..



*తెలంగాణ ఏర్పడిన తరువాత సింగరేణి యాజమాన్యం వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దవాఖానల్లో గతంలో కంటే అన్ని సౌకర్యాలు కల్పించింది. దీంతో సింగరేణి దవాఖానల్లోనే ప్రైవేటు కంటే మెరుగైన వైద్యం లభిస్తున్నది. కొవిడ్ సమయంలో సింగరేణి అందించిన సేవలు అందించిన వైద్య సేవలు మరువలేనివి. సింగరేణిలో అన్ని వసతులతో వైద్యం లభించడం మా అదృష్టం.*

- మద్దెల శంకర్, మందమర్రి

### అన్ని వసతులతో చికిత్స ..



*సింగరేణి దవాఖానలు పూర్తిగా మారిపోయాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సార్ సింగరేణి అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో సింగరేణి దవాఖానకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికర పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడు అన్ని వసతులతో కూడిన వైద్య అందుతున్నది. సింగరేణి యాజమాన్యం కృషి మరువలేనిది.*

- సీపెల్లి రాజలింగు, సింగరేణి కార్మికుడు, మందమర్రి

### కార్పొరేట్ స్థాయిలో..



*సింగరేణి దవాఖానల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతున్నది. డిస్పెన్సరీలతో పాటు ఏరియా దవాఖానల్లో యాజమాన్యం అన్ని రకాల వసతులు కల్పిస్తున్నది. ఉమ్మడి పాలనలో సింగరేణి దవాఖానలు పేరుకే అన్నట్లు ఉండేవి. స్వపరిపాలనలో కార్పొరేట్‌స్థాయిలో ప్రైవేటుకు దీటైన సౌకర్యాలతో చికిత్స అందిస్తున్నారు. అందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.*

- అందె శ్రీకాంత్, మందమర్రి

### ఆహ్లాదకరమైన వాతావరణం..




*సింగరేణి దవాఖానల్లో ఏపుగా పెరిగిన మొక్కలు, పండ్లు, పూల రకాల మొక్కలతో అహ్లాదకరమైన వాతావరణం ఉంది. అక్కడికి వెళ్లే వారికి ఆ వాతావరణ ఊరటనిస్తున్నది. ఏసీ వార్డులు, అన్ని వసతులతో వైద్య అందించడంతో ఆసుపత్రులపై విశ్వాసం పెరిగింది. సింగరేణి ఉద్యోగులు తీవ్రమైన అనారోగ్యం బారిన పడినప్పుడు అన్ని వసతులతో కూడిన అంబులెన్స్‌ల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.*

- బెల్లం అశోక్, మందమర్రి

# పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మంగపేట, నవంబర్ 17 : పోస్టల్ సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ హనుమంతు అన్నారు. మండలంలోని కమలాపురంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ సేవలు, తపాలా పరిధిలోని ఇన్సూరెన్స్ సదుపాయాలను వివరించారు. అనంతరం మండలంలోని తొండ్యాలకు చెందిన కుడుముల నర్సింగరావు పేర వచ్చిన రూ.10 లక్షల బీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ద్వారా రూ.399 ఇన్సూరెన్స్ చేశాడన్నారు. ఈపాలసీ చేయించిన బీపీఎం ప్రశాంత్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ మేనేజర్ భాస్కర్, సీనియర్ మేనేజర్ అరుణ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, ములుగు ఐపీవో రామ్మూర్తి, కౌశిక్, తనూస్, అశోక్, చంద్రకాంత్, రమేశ్, సయ్యద్‌మీర్, పలువురు బీపీఎం పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సూపరింటెండెంట్ హనుమంతు

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10వేల జరిమానా

గోవిందరావుపేట, నవంబర్ 17 : మండలంలోని పస్రా గ్రామానికి చెందిన గడ్డం శ్రీను మద్యం సేవించి వాహనం నడిపినందుకు ములుగు జడ్జి రామ్మోహన్‌రెడ్డి రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై షేక్ మస్తాన్‌తెలిపారు. పస్రా చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అధిక మద్యం సేవించి వాహనం నడుపుతుండగా డ్రంకన్ డ్రైవ్ నిర్ధారణ పరీక్ష చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. నాయమూర్తి నిందితుడు శ్రీనుకు జరిమానా విధించారన్నారు.

### గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముగ్గురు గుడుంబా విక్రయిస్తుండగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. చల్వాయి గ్రామానికి చెందిన ఎల్లం సారమ్మ, కొండ శశికళ, బాలాజీనగర్‌కు చెందిన నాగవత్ ప్రవీణ్ గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశామన్నారు. వారి వద్ద నుంచి 30 లీటర్ల గుడుంబాతో పాటు ప్రవీణ్ బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వాజేడు, నవంబర్ 17 : భార్య మందలించిందని ఓ వ్యక్తి గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వాజేడు ఎస్సై చావాళ్ల వెంకటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన మోడెం కృష్ణయ్య (54) మద్యం తాగుతుండడంతో భార్య సమ్మక్క మందలించింది. దీంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వాజేడు పీహెచ్‌సీకి తరలించగా వైద్యుడు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపాడు. మృతుడి భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని శుక్రవారం ఏటూరునాగారం వైద్యశాలకు పోస్టుమార్టం కోసం తరలించినట్లు ఎస్సై తెలిపారు.